సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



ఫ్యూచర్‌సిటీతోనే అభివృద్ధి

ఫార్మాసిటీ బదులు ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నామని, ప్రజల మద్దతు అవసరమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. 10లో▸



ఉద్యాన పంటల్లో సస్యరక్షణ

ఉద్యాన పంటలకు ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 10లో▸



విద్యుత్‌ తీగల కింద..

వినాయక మండపాల ఏర్పాటు, తరలింపులో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నా కొందరిలో మార్పు రావడం లేదు. 10లో▸

న్యూస్‌రీల్‌

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘన స్వాగతం



రాంచందర్‌రావుకు స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు

మొయినాబాద్‌: చేవెళ్లలో పల్లె నిద్ర కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌ రావుకు మొయినాబాద్‌లో ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. గురువారం మధ్యాహ్నం మున్సిపల్‌ కేంద్రంలో గజమాలతో స్వాగతం పలికి ప్రధాన చౌరస్తాలో ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్‌ రత్నం, పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్‌, రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యుడు సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్‌ అధ్యక్షుడు శ్రీకాంత్‌, మండల మాజీ అధ్యక్షులు గున్నాల గోపాల్‌రెడ్డి, క్యామ పద్మనాభం, మాజీ సర్పంచ్‌ రత్నం, రాజు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, లక్ష్మీపతియాదవ్‌, నీలకంఠం, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

బ్రాహ్మణ సేవాసంఘం నూతన నియామకం



నియామకపత్రం అందుకుంటున్న రవిశర్మ

షాద్‌నగర్‌రూరల్‌: రాష్ట్ర బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య యువజన ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా పట్టణానికి చెందిన రవికుమార్‌ శర్మ (రవిశర్మ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు రవిశర్మకు నియామకపత్రం అందజేశారు. పట్టణంలోని శివమారుతీ దేవాలయంలో అర్చకుడిగా పని చేస్తున్న రవిశర్మ గతంలో రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య డివిజన్‌ అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా పని చేశారు.

అడిషనల్‌ జ్యుడీషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌గా సాహితి



షాద్‌నగర్‌రూరల్‌: షాద్‌నగర్‌ కోర్టు అడిషనల్‌ జ్యుడీషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌, అడిషనల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జిగా మల్యాల సాహితి నియమితులయ్యారు. హైకోర్టు విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం బదిలీలు, నూతన ఎంపికలో భాగంగా ఆమె షాద్‌నగర్‌ కోర్టు నూతన జడ్జిగా నియమితులయ్యారు. గతంలో ఇక్కడ అడిషనల్‌ జ్యుడీషియల్‌ ఫస్ట్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌గా పని చేసిన ధీరజ్‌ కుమార్‌ బదిలీపై వెళ్లారు.


మీర్‌పేట కమిషనర్‌గా నాగమణి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన నాగమణి

మీర్‌పేట: మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌గా నాగమణి గురువారం బాధ్యతలు చేపట్టారు. దమ్మాయిగూడ కమిషనర్‌గా పనిచేసిన ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఏఎంసీ సంరెడ్డి నాగేందర్‌రెడ్డి, డీఈ వేణుగోపాల్‌, ఇతర సిబ్బంది నాగమణికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు స్వశక్తితో ఆర్థిక ప్రగతి సాధించాలి



మాట్లాడుతున్న రాఘవేందర్‌

కద్లాల్‌: మహిళలు స్వశక్తితో ఆర్థిక ప్రగతి సాధించాలని తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్‌ అన్నారు. మండల కేంద్రంలో అభయ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న కుట్టు మిషన్‌ శిక్షణను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు సొంత కాళ్లపై నిలబడేందుకు అభయ ఫౌండేషన్‌ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు మాధవులు, నాయకులు కుమార్‌గౌడ్‌, మహేశ్‌, వెంకటేశ్‌, రమేశ్‌నాయక్‌, ఇమ్రాన్‌బాబా తదితరులు ఉన్నారు.

లోడు.. బాదుడు!



భారంగా కొత్త విద్యుత్‌ కనెక్షన్లు

- విస్తీర్ణాన్ని బట్టి డిస్కం మోత
- సింగిల్‌ బెడ్‌రూమ్‌, డబుల్‌, త్రిబుల్‌, ఫోర్‌ బీహెచ్‌కేకు విడివిడిగా కనెక్టివిటీ లోడు
- వినియోగదారులకు షాక్‌
- కొత్త నిబంధనలతో ఆందోళన

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొత్త విద్యుత్‌ కనెక్షన్లు వినియోగదారులకు షాక్‌ ఇవ్వనున్నాయి. అపార్ట్‌మెంట్లు, మల్టీస్టోరేజ్‌, హైరేజ్‌ బిల్డింగ్స్‌లోని గృహాల విద్యుత్‌ (ఎల్‌టీఎం) కనెక్షన్లు మరింత భారం కానున్నాయి. వినియోగదారుడి అవసరం, అభిప్రాయంతో సంబంధం లేకుండా డిస్కమే స్వయంగా కనెక్టివిటీ లోడు నిర్ణయించడం, ఈ మేరకు కచ్చితమైన నిబంధనలు అమల్లోకి తేవడంతో ఆయా గృహ విద్యుత్‌ వినియోగదారులు ఆర్థిక భారం మోయకతప్పని పరిస్థితి నెల కొంది. సింగిల్‌ బెడ్‌రూమ్‌ ఇంటికి రెండు కిలోవాట్లు, డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇంటికి ఐదు, త్రిబుల్‌బెడ్‌రూమ్‌ ఇంటికి పది, నాలుగు అంతకంటే ఎక్కువ బెడ్‌రూమ్‌లున్న ఇంటికి 15 కిలోవాట్ల లోడును తప్పనిసరి చేసింది. వినియోగదారులంతా దరఖాస్తు సమయంలో ఆయా కిలోవాట్లకు నిర్దేశించిన ఫీజు మొత్తాన్ని చెల్లించాలని సూచించింది. ఫలితంగా కొత్తగా ఇల్లు కట్టుకోవాలని భావించిన వారిపై గతంతో పోలిస్తే అదనపు భారం తప్పడం లేదు.

తక్కువ సామర్థ్యం లోడుతో దరఖాస్తు

ప్రస్తుతం గ్రేటర్‌ జిల్లాల్లో 64 లక్షల విద్యుత్‌ కనెక్షన్లు ఉండగా వీటిలో 53 లక్షల గృహ, మరో 8 లక్షల వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. సాధారణ రోజుల్లో డిమాండ్‌ 68 నుంచి 70 మిలియన్‌ యూనిట్లు నమోదవుతుండగా వేసవిలో 90 మిలియన్‌ యూనిట్లు దాటుతోంది. దీనికి తోడు నెలకు సగటున 2,500పైగా కొత్త కనెక్షన్లు వచ్చి చేరుతున్నాయి. మెజార్టీ నిర్మాణ సంస్థలు/ బిల్డర్లు భవిష్యత్తు అవసరాలను పరిగణలోకి తీసుకోవడం లేదు. ఒక్కో ఫ్లాటుకు ఒక కిలోవాట్‌ చొప్పున కనెక్టివిటీ లోడు నిర్ణయించి, ఆ మేరకు కిలోవాట్‌కు రూ.1,616 ఫీజు చెల్లించి కొత్త కనెక్షన్లకు దరఖాస్తు చేస్తున్నారు. తీరా గృహ ప్రవేశం తర్వాత ఎంచుకున్న లోడుకు మించి విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. సామర్థ్యానికి మించి వినియోగిస్తుండడంతో వేడికి వైర్లు ఒత్తిడికి లోనై కాలిపోవడంతో పాటు డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నాయి. లో ఓల్టేజీ కారణంగా సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్య తలెత్తి ఇంట్లో విలువైన విద్యుత్‌ గృహోపకరణాలు కాలి బూడిదై పోతున్నాయి. భవిష్యత్తు అవసరాల మేరకు ముందే కనెక్టివిటీ లోడు ఎంపిక చేసుకుంటే సమస్యలు ఉండవని దక్షిణ తెలంగాణ విద్యుత్‌ పంపిణీ సంస్థ స్పష్టం చేస్తోంది. ఇంటి నిర్మాణ ప్లాన్‌, కిచెన్లు, పడక గదుల నిష్పత్తి ఆధారంగా కనెక్షన్లు, కనెక్టివిటీ లోడు ముందే ఎంపిక చేసుకోవడం ద్వారా ఈ సమస్యకు చెక్‌ పెట్టొచ్చని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ నిర్ణయంతో కొత్తగా ఇళ్లు నిర్మించుకుని, విద్యుత్‌ కనెక్షన్లు పొందాలని భావించిన పేద, మధ్య తరగతి ప్రజలపై భారం పడనుంది.

రెట్టింపు కానున్న ఖర్చు

ఔటర్‌ రింగ్‌ రోడ్డుకు అటుఇటుగా అనేక కొత్త అపార్ట్‌మెంట్లు, మల్టీ స్టోరేజ్‌ భవనాలు, హైరేజ్‌ నిర్మాణాలు వెలుస్తున్నాయి. వినియోగదారుల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా ఆయా నిర్మాణ సంస్థలు తక్కువ కనెక్టివిటీ లోడు కనెక్షన్లు తీసుకుంటున్నాయి. నిజానికి గతంలో ఏడాది సగటు విద్యుత్‌ వినియోగాన్ని పరిగణలోకి తీసుకుని, కనెక్టివిటీ లోడుకు మించి విద్యుత్‌ను వినియోగించిన వారికి నోటీసులు జారీ చేసేవారు. డెవలప్‌మెంట్‌ చార్జీలు వసూలు చేసి, ఆ మేరకు పబ్లిక్‌ డీటీఆర్‌, సబ్‌స్టేషన్లలోని పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచేవారు. యాజమాన్యం ఏకపక్ష నిర్ణయంతో ఆయా వినియోగదారులంతా కనెక్షన్ల కోసం గృహ ప్రవేశానికి ముందే భారీగా ఖర్చు చేయాల్సి వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

❖ ఏం చేయమంటారు చెప్పండి..



పంటలకు కావాల్సిన యూరియా కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. డిమాండ్‌ ఏర్పడడంతో పీఏసీఎస్‌ కేంద్రాలకు బారులు తీరుతున్నారు. నందిగామ మండలం చేగూరు పీఏసీఎస్‌కు గురువారం ఉదయమే చేరుకున్నారు. గంటల తరబడి నిలబడలేక ఇలా చెప్పులను క్యూలైన్‌లో పెట్టారు.

– నందిగామ

❖ రోడ్లు.. పాట్లు.. నిరసనగా వరినాట్లు



మొయినాబాద్‌ మున్సిపల్‌ పరిధిలోని అజీజ్‌నగర్‌ ఎస్సీ కాలనీ నుంచి శ్రీనిధి స్కూల్‌ వరకు రోడ్డుపై భారీగా గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో గురువారం అజీజ్‌నగర్‌ గ్రామానికి చెందిన మహిళలు, స్థానిక నాయకులు గుంతల్లో ఇలా వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు.

– మొయినాబాద్‌

బాలాపూర్‌ గణేశుడి రూట్‌ మ్యాప్‌ పరిశీలన



గణనాథుడి కోసం వేస్తున్న సెట్‌ను పరిశీలించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు తదితరులు

బడంగ్‌పేట్‌: బాలాపూర్‌ గణనాథుడి శోభాయాత్రకు తరలివెళ్లే ప్రాంతాలను గురువారం పోలీసులు పరిశీలించారు. రాచకొండ పోలీస్‌ కమిషనర్‌ సుధీర్‌బాబు, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, మహేశ్వరం ఏసీపీ జానకీరెడ్డి, బాలాపూర్‌ సీఐ సుధాకర్‌తో కలిసి పర్యటించారు. గణేశుడి కోసం వేస్తున్న సెట్‌ గురించి ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. దర్శనానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌ స్థలాన్ని పరిశీలించారు. ఉత్సవాలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

గణేశ్‌ ఉత్సవాల్లో అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ జానకీరెడ్డి

కందుకూరు: వినాయ చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని మహేశ్వరం ఏసీపీ ఎస్‌.జానకీరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌ఆర్‌ ఫంక్షన్‌హాల్‌లో గురువారం సీఐ సీతారాం ఆధ్వర్యంలో పీస్‌ కమిటీ సమావేశం నిర్వహించారు. మండపాల నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. మండపాల ఏర్పాటుపై ముందస్తుగా పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. విద్యుత్‌ సరఫరా కోసం నాణ్యమైన విద్యుత్‌ తీగలనే వాడాలన్నారు. డీజేకు అనుమతి లేదన్నారు. ప్రధాన మండపాల వద్ద నిర్వాహకులే సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ గోపాల్‌, ఎంపీడీఓ సరిత, విద్యుత్‌ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌ అండ్‌ బీ ఏఈ రవి, ఫైర్‌ ఆఫీసర్‌ నాగార్జున, మెడికల్‌ ఆఫీసర్‌ ఉమెరా సుల్తానా పాల్గొన్నారు.

హెచ్‌ఎండీఏ ప్లాట్లు రిజిస్ట్రేషన్‌ చేయండి



అదనపు కలెక్టర్‌ చంద్రారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బాధితులు

ఇబ్రహీంపట్నం రూరల్‌: తొర్రూర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్‌ఎండీఏ ప్లాట్లు రిజిస్ట్రేషన్‌ చేయాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం అడిషన్‌ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలం తొర్రూరల్‌లో సర్వే నంబర్‌ 383లో 117 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేసిన వెంచర్‌లో ప్లాట్లు కేటాయించి నేటికీ రిజిస్ట్రేషన్‌ చేయలేదని అన్నారు. భూములు కోల్పోయిన తమకు 2022లో ఎకరానికి 300 గజాల చొప్పున కేటాయించినప్పటికీ ఇప్పటికీ రిజిస్ట్రేషన్‌ చేయలేదన్నారు. పూర్తి హక్కులు కల్పిస్తామని చెప్పిన నాలుగేళ్లు గడిచినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి హక్కులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బాధితులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి సాగు నీరివ్వాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న పాలమూరు అధ్యయన వేదిక, ప్రజా సంఘాల నాయకులు

పాలమూరు అధ్యయన వేదిక జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌

షాద్‌నగర్‌రూరల్‌: ఉమ్మడి పాలమూరు జిల్లాలోని చంద్రసాగర్‌, అమ్రాబాద్‌ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి వ్యవసాయ రంగానికి సాగు నీటిని అందించాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌ డిమాండ్‌ చేశారు. చంద్రసాగర్‌, అమ్రాబాద్‌ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే చేపట్టాలని కోరుతూ గురువారం పట్టణంలోని ఎమ్మార్సీ భవనం ఆవరణలో పాలమూరు అధ్యయన వేదిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్‌ జిల్లాకు అప్పర్‌ప్లాట్‌కు జరిగిన అన్యాయం మరెక్కడా జరగలేదని ఆరోపించారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే పాలమూరు ప్రజలు వలస కూలీలు, నిర్వాసితులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లా నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు నీటి తరలింపును అడ్డుకునే ప్రయత్నం చేయడంలేదని ఆరోపించారు. అప్పర్‌ప్లాట్‌ దిగువ రైతాంగానికి, ఎగువ రైతాంగానికి మధ్య విభేదాలు తలెత్తకుండా చంద్రాసాగర్‌ రిజర్వాయర్‌ ఆధారంగా నీటిని లిఫ్ట్‌ చేసి సాగు నీరందించాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అర్జునప్ప, నర్సింలు, కృష్ణ, నర్సింలుగౌడ్‌, బాలయ్య, తిరుమలయ్య, చంద్రశేఖర్‌, కృష్ణయ్య, శివరాములు, చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ కేసు.. రెండు రోజులకే ఆఫీసు!

- ఏకంగా సీట్లో కూర్చొని పలు దస్త్రాలపై సంతకాలు
- చర్చనీయాంశమైన ఆమనగల్లు తహసీల్దార్‌ లలిత తీరు
- సస్పెన్షన్‌ వేటు.. కేసు నమోదుకు కలెక్టర్‌ సిఫార్సు



లలిత, తహసీల్దార్‌, ఆమనగల్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మూడు రోజుల క్రితం ఏసీబీ అదుపులో ఉన్న తహసీల్దార్‌ గురువారం ఏకంగా అదే ప్రభుత్వ ఆఫీసులో ప్రత్యక్షమయ్యారు. ప్రభుత్వ అధికారిగా సీట్లో కూర్చొని, ఏకంగా పలు దస్త్రాలపై సంతకాలు సైతం చేశారు. కార్యాలయ ఉద్యోగులంతా అవాక్కయ్యారు. ఏం జరుగుతుందో తెలియక అయోమయానికి లోనయ్యారు. పట్టాదారు పాసు పుస్తకంలో దొర్లిన పేరు తప్పిదాన్ని సరి చేసేందుకు ఆమనగల్లు తహసీల్దార్‌ లలిత ఓ రైతు నుంచి డబ్బులు డిమాండ్‌ చేసింది. అప్పటికే సర్వేయర్‌ రవి సహకారంతో రూ.50 వేలు తీసుకుంది. మరింత మొత్తం కావాలని డిమాండ్‌ చేయడంతో సదరు బాధితుడు చేసేది లేక ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో ఈ నెల 19న అవినీతి నిరోధకశాఖ అధికారులు ఆమనగల్లు తహసీల్దార్‌ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. తహసీల్దార్‌ లలిత, మండల సర్వేయర్‌ కోట రవిపై కేసు నమోదు చేశారు. చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ కలెక్టర్‌కు నివేదించారు. ఈ మేరకు మీడియాకు ఒక ప్రకటన కూడా విడుదల చేశారు. నిజానికి వారిద్దరినీ అరెస్ట్‌ చేసి, జైలుకు తరలించినట్లు అంతా భావించారు. కానీ ఏసీబీ అధికారులు అలా చేయకుండా కేవలం నోటీసులిచ్చి వదిలేశారు. దీన్ని సదరు తహసీల్దార్‌ అవకాశంగా తీసుకున్నారు. బుధవారం విధులకు దూరంగా ఉన్నప్పటికీ గురువారం ఏకంగా ఆఫీసులో ప్రత్యక్షమై పలు దస్త్రాలపై సంతకాలు కూడా చేశారు. మధ్యాహ్నం ఒకటిన్నర వరకు సీట్లోనే కూర్చొని కనిపించారు.

తహసీల్దార్‌పై సస్పెన్షన్‌ వేటు

అవినీతి ఆరోపణల కేసును ఎదుర్కొంటున్న తహసీల్దార్‌ లలితను సస్పెండ్‌ చేస్తూ కలెక్టర్‌ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. భూభారతి లాగిన్‌ సహా ప్రభుత్వ సిమ్‌కార్డును సైతం మార్చివేసినట్లు తెలిపారు. ఏసీబీ కేసు నమోదైన తర్వాత విధులకు హాజరు కావడం నేరమని, విషయం తెలిసిన వెంటనే డిప్యూటీ తహసీల్దార్‌ వినోద్‌కుమార్‌ ద్వారా సదరు తహసీల్దార్‌పై ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించినట్లు తెలిపారు. కేసు నమోదు చేయాల్సిందిగా కోరుతూ డీటీ ద్వారా తమకు ఫిర్యాదు అందిందని, ఈ మేరకు ఎఫ్‌ఐఆర్‌ కూడా నమోదు చేయనున్నట్లు ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్‌ తెలిపారు.

దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టొద్దు

- భూభారతికి ప్రాధాన్యత ఇవ్వాలి
- సత్వరమే పరిష్కరించాలి
- అదనపు కలెక్టర్‌ చంద్రారెడ్డి



ధాన్యం సేకరణపై మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ చంద్రారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూ భారతి దరఖాస్తులు, ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్‌ చంద్రారెడ్డి ఆదేశించారు. భూభారతి దరఖాస్తులు, ఇతర అంశాలపై సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులతో గురువారం ఆయన టెలీకాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల్లో ఆయా మాడ్యుల్స్‌లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? ఎంత మందికి నోటీసులు ఇచ్చారు? క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూభారతి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరగకుండా రోజువారీగా పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, పరిష్కారంకాకుంటే దరఖాస్తుదారుడికి సమా చారం అందించాలని ఆయన సూచించారు. గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని సివిల్‌ సప్లయ్‌ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూములను గుర్తించి, ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని, ఆక్రమణలకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని, ఆక్రమణదారులుపై చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సంగీత, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సివిల్‌ సప్లయ్‌ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధంకండి

ఇబ్రహీంపట్నం రూరల్‌: రానున్న ఖరీఫ్‌ సీజన్‌లో అవసరమైన ధాన్యం సేకరించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ చంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై గురువారం అదనపు కలెక్టర్‌ చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 33 వేల హెక్టార్ల ధాన్యం సేకరణ అంచనా వేసినందున, ఎక్కడా సమస్య తలెత్తకుండా చూడాలని అన్నారు. ధాన్యం కొనుగోలుకు 33 కేంద్రాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు ఎలక్ట్రానిక్‌ పరికరాల పనితీరును మరోసారి పరిశీలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన పరికరాలు, గన్నీ బ్యాగులు, టార్పిలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత, జిల్లా మేనేజర్‌ గోపీకృష్ణ, డీఆర్‌డీఓ శ్రీలత, వ్యవసాయాధికారి ఉష, జిల్లా కోఆపరేటివ్‌ అధికారి సుధాకర్‌, మార్కెటింగ్‌ శాఖ అధికారి రియాజుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్‌సిటీతోనే అభివృద్ధి



కుర్మిద్ద తండాలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: ఫార్మాసిటీ బదులు ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తున్నామని, ఇందుకు ప్రజల మద్దతు అవసరమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కుర్మిద్ద, మంగళిగడ్డతండా, మర్లకుంటతండా, తాడిపర్తి గ్రామాల్లో గురువారం రూ.12 కోట్ల నిధులతో ఎమ్మెల్యే 117 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ హయాంలో ఫార్మాసిటీని నిర్మించాలని కుట్రలు చేశారన్నారు. కానీ రేవంత్‌రెడ్డి సర్కార్ ఫార్మాసిటీని రద్దు చేసి అదే భూముల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్నారు. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధిపథంలో దూసుకెళ్తుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 20 ఏళ్ల దూరదృష్టితో అభివృద్ధి పనులు చేపట్టడానికి టీజీఐఐసీ ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందన్నారు. అందులో భాగంగా యాచారం–కందుకూరు రోడ్డును వంద అడుగులకు విస్తరించడానికి కృషి చేస్తానన్నారు. ఫార్మాసిటీ భూసేకరణలో నకిలీ, బినామీ పేర్లతో రూ.కోట్లాది పరిహారం పొందిన అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ అనంత్‌రెడ్డికి సూచించారు. కుర్మిద్దలో అసైన్డ్ పట్టాదారు, పాసుపుస్తకాల్లో ఉన్న ఎకరాలకు మొత్తం పరిహారం ఇవ్వకుండా అప్పటి అధికారులు మోసం చేశారని రైతులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఫార్మాసిటీకి పట్టా భూములు ఇవ్వనందుకు అప్పటి అధికారులు టీజీఐఐసీ పేరు మీద భూ రికార్డులు మార్చేశారని, వాటిని మళ్లీ తమపై మార్చేలా కృషి చేయాలని కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లోని రైతులు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, మాజీ ఎంపీటీసీ యాదయ్యచారి, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, రమేష్, రాజశేఖర్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, అరవింద్‌నాయక్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు సైబర్ నేరగాళ్లకు అరదండాలు

వేర్వేరు కేసుల్లో అరెస్టు చేసిన సిటీ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: రెండు వేర్వేరు కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురు సైబర్ నేరగాళ్లకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు ఒక కేసులో, మరొకరు ఇంకో కేసులో నిందితులుగా ఉన్నట్లు డీసీపీ దార కవిత గురువారం ప్రకటించారు. సికింద్రాబాద్‌కు చెందిన ఓ బాధితుడు (62) ఫేస్‌బుక్‌లో వచ్చిన ప్రకటన చూసి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కారు. ట్రేడింగ్ ద్వారా భారీ లాభాలు ఆర్జించవచ్చని ఎర వేసిన కేటుగాళ్లు తొలుత లాభాలు ఇచ్చారు. ఆపై బాధితుడి నుంచి ఏకంగా రూ.2.02 కోట్లు స్వాహా చేశారు. ఈ మేరకు నమోదైన కేసు దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ పి.ప్రమోద్ కుమార్ నేతృత్వంలోని బృందం గతంలోనే ఐదుగురు నిందితులను అరెస్టు చేసింది. తాజాగా హర్యానాకు చెందిన అకౌంట్ హోల్డర్ వినీత్ చంద్రను పట్టుకున్నారు. ఐడీఎఫ్‌సీ బ్యాంకులో ఉన్న ఇతడి ఖాతాలోకి బాధితుడి నగదు రూ.40 లక్షలు డిపాజిట్ అయినట్లు గుర్తించారు. వినీత్ నుంచి పోలీసులు ఆరు సెల్‌ఫోన్లు, ఓ ల్యాప్‌టాప్, ఓ చెక్ బుక్ స్వాధీనం చేసుకున్నారు. మరో ఉదంతంలో.. ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి రూ.63.45 లక్షలు రీఎంబర్స్‌మెంట్ చేయిస్తామంటూ నగర వాసికి (58) సైబర్ నేరగాళ్లు ఫోన్ ద్వారా ఎర వేశారు. బాధితుడు అంగీకరించడంతో అడ్వాన్స్‌గా కొంత మొత్తం చెల్లించాలని, రీఫండ్ అవుతుందని రూ.4.02 లక్షలు కాజేశారు. ఈ మేరకు నమోదైన కేసును దర్యాప్తు చేసిన పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన అకౌంట్ సప్లయర్లు దేవష్ రస్తోగీ, జితేందర్ అగర్వాల్‌లను అరెస్టు చేశారు.

మత్తుగా మాట్లాడి రూ.7.11 లక్షలు స్వాహా...

అమీర్‌పేటకు చెందిన ఓ వృద్ధుడికి(81) ఫోన్ ద్వారా మాయా రాజ్‌పుత్‌గా పరిచయమైన ఓ మహిళ మత్తుగా మాట్లాడి రూ.7.11 లక్షలు స్వాహా చేసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. బాధితుడికి ఈ ఏడాది జూన్ నుంచి ఫోన్, వాట్సాప్ కాల్స్‌తో పాటు సందేశాలు మొదలయ్యాయి. తొలినాళ్లలో మధురంగా మాట్లాడి ముగ్గులోకి దింపింది. ఆపై అసలు కథ మొదలెట్టి వైద్యం, స్థిరాస్తి రిజిస్ట్రేషన్, తనఖాలో ఉన్న ఆభరణాలు విడిపించుకోవడం, ఎలక్ట్రానిక్ కొనుగోలు అవసరాలు చెబుతూ డబ్బు గుంజింది. ఓ దశలో బాధితుడిని కుటుంబీకులకు వ్యతిరేకంగా మారేలా బ్రెయిన్ వాష్ చేసింది. ఎట్టకేలకు తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి



సురేశ్ మృతదేహం

చేవెళ్ల: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మూర్ఛ వ్యాధితో పాడి పోయి మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసారం బస్‌స్టేజీ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం రాయిచూర్ గ్రామానికి చెందిన సురేశ్(30) భార్య సోనీలు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. సురేశ్‌కి మూర్ఛ వ్యాధితో పాటు మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 19న భార్యాభర్తలు నగరంలో ఉండే సురేశ్ సోదరుడు హనుమంతు వద్దకు ఆస్పత్రికి చూపించుకునేందుకు వెళ్లారు. అక్కడే ఉండగా 20న సురేశ్ ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. ఆయన మద్యం తాగి హైదరాబాద్ నుంచి తాండూరుకు వెళ్లేందుకు బస్సు ఎక్కి చేవెళ్లలో దిగిపోయాడు. కేసారం గేట్ వద్ద అతనికి మూర్ఛ రావడంతో అక్కడే కిందపడి మృతి చెందాడు. స్థానికులు గమనించి గురువారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెళ్లి పరిశీలించి అతని వద్ద లభించిన ఆధారాలతో విచారణ చేయగా కొడంగల్‌కు చెందిన సురేశ్‌గా గుర్తించారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. భార్య సోని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు గుర్తుతెలియని మృతదేహాలు స్వాధీనం

చిలకలగూడ: వేర్వేరు ఘటనల్లో నాలుగు గుర్తుతెలియని వ్యక్తుల మృతదేహాలను చిలకలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాంధీఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది, చిలకలగూడ పోలీసులు తెలిపిన మేరకు.. సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి ప్రాంగణంలోని వెయిటింగ్‌హాలు వద్ద రెండు రోజులుగా ముగ్గురు వ్యక్తులు అపస్మారకస్థితిలో ఉన్నట్లు సెక్యూరిటీ సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని అత్యవసర విభాగంలో చేర్పించారు. చికిత్సపొందుతూ గురువారం గుర్తుతెలియని ముగ్గురు మృతి చెందారు. మృతులంతా గాంధీఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో నివసించే యాచకులుగా భావిస్తున్నారు.

మైలార్‌గడ్డలో...

సీతాఫల్‌మండి మైలార్‌గడ్డలో బాలాజీ స్వీట్ షాపు సమీపంలో ఓ వ్యక్తి అనారోగ్యంతో పడున్నట్లు గస్తీ పోలీసులు గుర్తించారు. ప్రత్యేక వాహనంలో గాంధీ అత్యవసర విభాగానికి తరలించగా, చికిత్స పొందుతు గురువారం మృతిచెందాడు. కుటుంబసభ్యులు గుర్తించేందుకు మార్చురీలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు.

ఉద్యాన పంటల్లో సస్యరక్షణ

కృషి విజ్ఞాన్ కేంద్రం క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ



కందుకూరు: ప్రస్తుతం సాగులో ఉన్న ఉద్యాన పంటలైన టమాటా, బెండ, వంగ, కాకర, జామ వంటి తదితర పంటల్లో ప్రధాన సమస్యలను ఉద్యాన శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆయా పంటలకు ఆశిస్తున్న తెగుళ్లు, పురుగులు, వాటి నివారణకు అత్యవసరంగా తీసుకోవాల్సిన అంశాలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై కృషి విజ్ఞాన్ కేంద్రం క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.



తెగులు సోకిన టమాటా పంట

ముందస్తు రక్షణ చర్యలివే

సూక్ష్మజీవుల మిశ్రమం యొక్క అప్లికేషన్ అనగా ట్రైకోడెర్మా, సూడోమోస్, పెసిలోమైసెస్, అజాటో బాక్టర్, ఫాస్ఫో బాక్టీరియా, పోటాస్ బాక్టీరియా, జింక్ బాక్టీరియాలను మొక్కలను నాటడానికి ముందు పశువుల ఎరువులో అభివృద్ధి చేసి పొలంలో వేసుకుంటే తెగుళ్లు, వ్యాధులు, సాగు ఖర్చు తగ్గుతాయి. కూరగాయల పంటలలో ముందు జాగ్రత్త చర్యగా నాటిన 15 రోజుల్లోపు కార్బెండజిమ్ 2గ్రా లీటరు నీటితో కలిపి నేల తడిచేలా పిచికారీ చేస్తే మట్టిలో పుట్టే రోగాలు రాకుండా చూడవచ్చు. రసం పీల్చే తెగుళ్లను నివారించడానికి లీటరు నీటికి ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ పిచికారీ చేయాలి. అన్ని ఉద్యాన పంటలు సూక్ష్మపోషక లోపం లక్షణాలను కనబరుస్తున్నట్లు గుర్తించడమైనది. మ్యాక్స్ లేదా గ్రోత్ లేదా విపుల్ లేదా స్వర్ణ పాల్ లేదా ఫార్ములాస్– 4 లేదా అర్కా వెజిటబుల్ స్పెషల్ 2– 3 గ్రా. లీటరు నీటికి పూల మొగ్గ ప్రారంభించే ముందు, పుష్పించే ముందు, పండు దశల్లో మూడుసార్లు పిచికారీ చేయాలి.

పంట గుర్తించిన సమస్య తీసుకోవాల్సిన చర్యలు

▲ **టమాటాలో..**



తెగులు సోకిన మిర్చి

ఆకు ముడత లీటర్ నీటిలో ఒక మి.లీ లేదా 1.5 గ్రాముల క్లోరోథలనిల్ లేదా ఒక మి.లీ.లీటరు నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. ప్రొఫికోనోజోల్ పిచికారీ చేయాలి

▲ **బ్యాక్టీరియల్ ఎండు తెగులు..**

కాపర్‌ఆక్సీక్లోరైడ్ 30 గ్రా+స్ట్రెప్టోసైక్లిన్ 10 లీటర్ల నీటికి ఒక గ్రాముతో మట్టిని తడిపి, అదే మోతాదులో రసాయనాలతో ఫోలియర్‌ను పిచికారీ చేయాలి.

▲ **బూజు తెగులు..**

లీటరు నీటికి సల్ఫర్ 3 గ్రా లేదా డైఫెంకోనోజోల్ 0.5 మి.లీ లేదా సాఫ్ 2 గ్రాములు కలిపి స్ప్రే చేయాలి.

▲ **తేనెబంగ, తామర పురుగుల..**

తేమ ఎక్కువగా ఉన్నప్పుడు థయోమిథాక్సిమ్ 0.3 గ్రా. లేదా డైఫెంతురియన్ 1.25గ్రా నివారణకు లేదా అసిఫెట్ 1.5 గ్రా లేదా డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

▲ **పండు తొలుచు పురుగు ..**



టమాటను ఆశించిన పురుగు

వరి తవుడు+బెల్లం+ మోనోక్రోటోఫాస్ లేదా క్లోరోపైరీఫాస్‌తో విషపు ఎరలను వరుసల మధ్య వేయాలి. అబామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ+డైక్లోరోవాస్ 1 మి.లీ లేదా థయోడికార్బ్ 1 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

▲ **పాము పొడ తెగులు**

ట్రైజోఫాస్ 2 మి.లీ లేదా డైఫెంతురీయన్ 1.25 గ్రాము, వేప నూనె 5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

▲ **కాయ కుళ్లు తెగులు..**

లీటరు నీటికి 5 గ్రా కాల్షియం నైట్రేట్‌ను వారం మధ్యలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

▲ **పూత, పిందె రాలకుండా..**

ప్లానోఫిక్స్ 3 మి.లీ+ సూక్ష్మపోషక మిశ్రమం 45 గ్రా. 15 లీటర్ల నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

▲ **వంకాయలో సస్యరక్షణ..**



తెగులు సోకిన వంగ

కాయ, కొమ్మ రెనాక్సిపైర్ 0.3 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ+ డైక్లోరోవాస్ తొలిచే పురుగు ఒక మి.లీ లీటరుకు 5 మి.లీ వేప నూనెతో కలిపి పిచికారీ చేయాలి.

▲ **ఎర్ర నల్లి..**

సల్ఫర్ 3గ్రా లేద ఆఅబామెక్టిన్ 1.0 గ్రా. లేదా ఫెంతురియన్ 1.25 గ్రా లేదా డైకోఫాల్ 5 మి.లీ లేదా ప్రొపార్జైట్ 2 మి.లీ లీటరు నీటికి వేప నూనెతో కలిపి పిచికారీ చేయాలి.

▲ **బెండతోటలో..**

కాయ తొలుచు పురుగు రెనాక్సిపైర్ 0.3 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ+డైక్లోరోవాస్ 1 మి.లీ లీటరు నీటికి 5 మి.లీ వేప నూనెతో కలిపి పిచికారీ చేయాలి.

▲ **రసం పీల్చే పురుగు..**

తేమ ఎక్కువగా ఉన్నప్పుడు థయోమిథాక్సిమ్ 0.3గ్రా లేదా డైఫెంతురియన్ 1.25గ్రా లేదా ఎసిఫేట్ 1.5 గ్రా, లేదా డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

▲ **ఎర్ర పురుగు..**

సల్ఫర్ 3గ్రా లేద ఆఅబామెక్టిన్ 1.0 గ్రా. లేదా డైఫెంతురియన్ 1.25 గ్రా లేదా డైకోఫాల్ 5 మి.లీ లేదా ప్రొపార్జైట్ 2 మి.లీ లీటరు నీటికి వేప నూనెతో కలిపి పిచికారీ చేయాలి.

▲ **కాకర,బెండలో..**

కాయ తొలుచు పురుగు సామూహిక ట్రాపింగ్ కోసం ఫెరోమోన్ ఉచ్చులు(15–20/ఎకరం)ఉంచాలి. డైక్లోరోవాస్ 1 మి.లీ లీటరు నీటికి పిచికారీ చేయాలి.

▲ **రసం పీల్చే పురుగు..**

తేమ ఎక్కువగా ఉన్నప్పుడు థయోమిథాక్సిమ్ 0.3గ్రా లేదా డైఫెంతురియన్ 1.25గ్రా లేదా ఎసిఫేట్ 1.5 గ్రా, లేదా డైమిథోయేట్ 2 మి.లీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

▲ **జామ..**

ఫ్రూట్ ఫ్లై సామూహిక ట్రాపింగ్ కోసం ఫెరోమోన్ ఉచ్చులు (15–20/ఎకరం) ఉంచాలి.మలాథియాన్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

విద్యుత్ తీగల కింద వినాయక మండపం



జేసీబీతో తొలగిస్తున్న మండపం

- గాలి వీచడంతో హైటెన్షన్ వైర్లపై పడిన ప్లాస్టిక్ కవర్లు
- అప్రమత్తతతో తప్పిన ముప్పు

తుర్కయంజాల్: వినాయక మండపాల ఏర్పాటు, తరలింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నా కొందరిలో ఏ మాత్రం మార్పు కనిపించడం లేదు. పోలీసుల హెచ్చరికలను కూడా పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు వరుసగా వెలుగు చూస్తూనే ఉన్నాయి. తాజాగా గురువారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాగన్నగూడ సూరజ్‌నగర్ కాలనీలో హైటెన్షన్ లైన్ కింద కొందరు యువకులు మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం పైకప్పుగా వేసిన కవర్లు గాలికి ఎగిరి హైటెన్షన్ లైన్‌పై పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అప్రమత్తమైన యువకులు వెంటనే పక్కకు తప్పుకుని, పోలీసులకు సమాచారం అందించారు. కరెంట్ సరఫరాను నిలిపివేయించి, జేసీబీ సాయంతో మండపాన్ని తొలగించారు. విద్యుత్ తీగలకు దూరంగా మరోచోట ఏర్పాటు చేసుకోవాలని యువకులకు పోలీసులు సూచించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుంతలో ఇరుక్కుపోయిన ట్రక్కు



నందిగామ టీ టైం చౌరస్తాలో నిలిచిపోయిన వాహనం

నందిగామ: మూడు రోడ్ల ముఖ్యకూడలి వద్ద గుంతలో ఇరుక్కుపోయిన వాహనంతో ఇతర వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అంతిరెడ్డిగూడ శివారులోని ఓ ఐరన్ పరిశ్రమ నుంచి గురువారం ఇనుప రాడ్లను లోడ్ చేసుకుని వెళ్తున్న బొలెరో వాహనం టీ టైం చౌరస్తా వద్ద ఉన్న గుంతలోకి ఇరుక్కుపోయింది. టైర్లు దిగబడటంతో అరగంట పాటు అక్కడే నిలిచిపోయింది. అసలే ప్రమాదకరమైన ఈ చౌరస్తాలో రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనంతో ఈ రూట్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ఇబ్బంది పడ్డారు.

బిహారీ యువకుడి అనుమానాస్పద మృతి

బాలానగర్: పనికోసం నగరానికి వచ్చిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. మృతుడు బీహార్‌లోని ఉపేంద్ర కోడా (30)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన మేరకు.. ఉపేంద్ర కోడా రెండు రోజుల క్రితమే బాలానగర్‌లోని రంగారెడ్డి నగర్‌లో ఉన్న వర్టెక్స్ ఇంజనీర్స్‌లో పనికి కుదిరాడు. గురువారం వర్షపు నీరు పోవడానికి కాలువ తవ్వుతున్న సమయంలో ఉపేంద్ర అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి కుప్పకూలి పోయాడు. వెంటనే అతడిని తోటి కార్మికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన చికిత్స కోసం బీబీఆర్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడికి వెళ్లేలోపే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు దినేష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక వచ్చాక తెలుస్తాయని బాలానగర్ డిఐ సక్రమ్ తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు సలీం

షాద్‌నగర్: జర్నలిస్టులు మీడియా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు ఎండీ.సలీం అన్నారు. గురువారం పట్టణ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) షాద్‌నగర్‌శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర మఫిషియల్ కమిటీ చైర్మన్ గుడుపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఎండి.సలీం హాజరై మాట్లాడుతూ.. పడిపోతున్న మీడియా విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి జర్నలిస్టుపై ఉందన్నారు. సమాజంలో సోషల్ మీడియా వినియోగం ఎక్కువగా పెరిగిపోవడంతో మీడియా విలువలు తగ్గుతున్నాయన్నారు. ప్రస్తుతం మీడియాలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇచ్చేందుకు కొత్త మార్గదర్శకాలు రూపొందుతున్నాయన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు వస్తాయన్నారు. అనంతరం డివిజన్ నూతన ప్రింట్ మీడియా కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీశైలం, భాస్కర్, రమేష్, రాఘవేందర్‌యాదవ్, నర్సింహ, ఫయాజ్, శ్రీనివాస్, విష్ణు, సాబేర్, శ్రీకాంత్, సంతోష్, శంకర్, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీ వద్ద గంజాయి లభ్యం

కేసు నమోదు చేసిన పోలీసులు



గంజాయితో నిందితుడిని పట్టుకున్న పోలీసులు

కేశంపేట: ఒడిషాకు చెందిన వలసకూలీ గురువారం గంజాయితో పోలీసులకు చిక్కాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం శివారులోని ఓ పౌల్ట్రీఫాంలో ఒడిషాకు చెందిన బిస్వాంత్ మేహర్ భార్యతో కలిసి జీవిస్తున్నాడు. సొంత రాష్ట్రంలో తన అమ్మానాన్నల వద్ద ఉన్న కూతురును చూసే సాకుతో రెండు నెలలకోసారి ఒడిషాకు వెళ్తాడు. తిరిగి వచ్చే క్రమంలో గంజాయి వెంటతెస్తాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు గురువారం పౌల్ట్రీఫాంలో బిస్వాంత్ మేహర్ గదిని తనిఖీ చేయగా 46 గ్రాముల గంజాయి లభించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ నరహరి తెలిపారు.

ప్రయాణికురాలి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్



ప్రయాణికురాలు సారద్‌తో ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ సంజయ్‌కుమార్

సికింద్రాబాద్: కదులుతున్న రైలు ఎక్కబోయి ప్రమాదం బారిన పడిన ఒక మహిళ ప్రాణాలను అక్కడే విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ రక్షించాడు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలను సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ ఆఫీసర్ ఏ.నవీన్‌కుమార్ గురువారం వెల్లడించారు. ఈనెల 20న సాయంత్రం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరుతున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు శ్రీకాకుళం జిల్లా కాంచిలికి చెందిన ముప్పినేటి సారద్ అనే 52 ఏళ్ల మహిళ ఎక్కే ప్రయత్నం చేసింది. బీ2 బోగి ఎక్కబోయిన మహిళ అదుపు తప్పి కిందపడింది. అదే సమయంలో అక్కడే విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌సంజయ్ కుమార్ ప్రమాదం బారిన పడుతున్న మహిళను గుర్తించి బయటకు లాగి బోగీ, ప్లాట్‌ఫామ్ మధ్య నలిగిపోకుండా రక్షించాడు. విధుల్లో అప్రమత్తంగా ఉండి ప్రమాదం బారిన పడిన మహిళను రక్షించిన కానిస్టేబుల్ సంజయ్‌కుమార్‌ను ఆర్‌పీఎఫ్ అధికారులు అభినందించారు.

ఆన్‌లైన్‌లో వాటర్ ఫీజిబిలిటీ సర్టిఫికెట్

ధ్రువపత్రాన్ని జారీ చేసే ప్రక్రియను సులభతరం ● ఆన్‌లైన్ సేవలు ప్రారంభించిన జలమండలి ఎండీ



ఆన్‌లైన్‌లో వాటర్ ఫీజిబిలిటీ ధ్రువపత్రం సేవలు ప్రారంభించిన జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: మహానగర పరిధిలో నూతన భవన నిర్మాణదారులకు జలమండలి ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా భవనాలు నిర్మించుకునే వారు జీహెచ్‌ఎంసీ అనుమతుల కోసం సమర్పించాల్సిన వాటర్ ఫీజిబిలిటీ ధ్రువపత్రాన్ని జారీ చేసే ప్రక్రియను సులభతరం చేసి ఆన్‌లైన్ లోనే పొందేలా సరికొత్త సదుపాయాన్ని కల్పించింది. గురువారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ కలిసి జూబ్లీహిల్స్ లోని జలమండలి థీమ్ పార్క్ లో ఆన్‌లైన్‌లో వాటర్ ఫీజిబిలిటీ ధ్రువపత్రాన్ని జారీ చేసే సేవలను లాంఛనంగా ప్రారంభించారు.

- గ్రేటర్ పరిధిలోని నూతన భవనం నిర్మించాలంటే జీహెచ్‌ఎంసీ పర్మిషన్ తప్పనిసరి. ఆ పర్మిషన్ కోసం భవన యజమానులు విద్యుత్ ఫీజిబిలిటీ తో పాటు జలమండలి జారీ చేసే వాటర్ ఫీజిబిలిటీ ధ్రువపత్రం సమర్పించాల్సి ఉంటుంది. గతంలో ఈ సర్టిఫికెట్స్ పొందాలంటే జలమండలి సర్కిల్ కార్యాలయాల్లో, తర్వాత ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో సీజీఎం జారీ చేసేవారు. వివిధ కారణాల రీత్యా ఈ ప్రక్రియలో జాప్యం జరిగేది. ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి ధ్రువపత్రాల జారీని ఆన్‌లైన్‌లోనే పొందేలాగా మార్పులు చేశారు.

ధ్రువపత్రాలు జారీ ఇలా...

జలమండలి హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి వెబ్‌సైట్ ద్వారా నీటి ఫిజిబిలిటీ సర్టిఫికెట్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. దీని కోసం అప్లై ఆన్‌లైన్ ఫర్ వాటర్ ఫీజిబులిటీ సర్టిఫికెట్ అనే లింక్ అందుబాటులో ఉంటుంది. దరఖాస్తు సమర్పించిన వెంటనే ఫైల్ నంబర్ జనరేట్ అవుతోంది. అవసరమైన పత్రాలను దరఖాస్తు సమయంలోనే అప్‌లోడ్ చేయాలి. ఇండెమ్నిటీ బాండ్‌ను రికార్డ్ కీపింగ్ కోసం సమర్పించాల్సి ఉంటుంది.

- ఒక్కో దరఖాస్తుపై రూ. 5,000 ప్రాసెసింగ్ ఫీజును నగదు కౌంటర్, ఆన్‌లైన్ విధానం ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. కనెక్షన్ చార్జీలు అందిన ఫైళ్లకు ఎస్‌ఎంఎస్ నోటిఫికేషన్ ఆధారంగా సీజీఎం (రెవెన్యూ) డిజిటల్ సంతకంతో ఫిజిబిలిటీ సర్టిఫికెట్ జారీ చేస్తారు.